రాజేంద్రనగర్‌లో పోలైన ఓట్లు..

నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 5,81,898 మంది ఉన్నారు. అందులో పురుషులు 3,02,995 మంది, మహిళలు 2,78,898 మంది, ట్రాన్స్‌జెండర్లు 40 మంది ఉన్నారు. రాజేంద్రనగర్‌లో మొత్తం పోలైన సంఖ్య 3,24,917 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతో రాజేంద్రనగర్‌లో మొత్తం 55.83 శాతం పోలింగ్ నమోదైంది.

నేడే కౌంటింగ్.. !

• ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం • లార్డ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు



కళాశాల ఆవరణలో భారీకేడ్లను ఏర్పాటు చేసిన అధికారులు

బండ్లగూడ: రాజేంద్రనగర్, షాద్‌నగర్, చేవెళ్ల మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హిమాయత్‌సాగర్ లార్డ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరగనున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను ప్రారంభించారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మొదటగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు మొదలౌతుంది. అనంతరం ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు చేపడతారు. పరిశీలకుల సమక్షంలో కౌంటింగ్ జరుగుతుంది. పరిశీలకుల అమోదం తర్వాతే ఫలితాలను వెల్లడిస్తారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్..

హిమాయత్ సాగర్ లార్డ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రాజేంద్రనగర్, షాద్‌నగర్, చేవెళ్ల మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఉండటంతో కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండటంతో పాటు సీసీ కెమెరాలతో నిఘాను ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర బలగాలతో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు.



హిమాయత్‌సాగర్‌లోని లార్డ్స్ కళాశాల భవనం

- రిటర్నింగ్ అధికారి అందజేసిన పాస్‌లను తప్పనిసరిగా ఏజెంట్లు తమ వద్దనే ఉంచుకోవాలన్నారు. అనుమతి లేని ఏ ఒక్కరిని లెక్కింపు ప్రాంతానికి అనుమతి ఇవ్వమన్నారు.
- కౌంటింగ్‌లోకి సెల్‌ఫోన్లు, ఇతర మండే స్వభావం ఉన్న వస్తువులను వేటిని అనుమతించబోమని స్పష్టం చేశారు. కేవలం ఏజెంట్ పాస్‌లను అనుమతిస్తామన్నారు.
- ఈ విషయాన్ని గుర్తు ఉంచుకుని ఏజెంట్లు తమ వెంట ఎలక్ట్రానిక్ పరికరాలు తదితర వాటిని తమ వెంట తీసుకురావొద్దన్నారు. లార్డ్స్ కళాశాల వైపు వచ్చే వాహనాలను ఇతర మార్గాల నుంచి దారి మళ్లిస్తామన్నారు.
- లార్డ్స్ కళాశాల వైపు ఎవరూ రావొద్దని, ఓట్ల లెక్కింపు ప్రక్రియ అనంతరం ఎలాంటి ర్యాలీలకు అనుమతి లేదన్నారు. బాణసంచా కాల్చడం, గుమిగూడి నినాదాలు చేయడం నిషేధమన్నారు.
- పోలీసులు స్థానిక ప్రాంతాల్లో గట్టి భద్రతా చర్యలను తీసుకుంటున్నారని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.
- ప్రజలు పోలీసులకు సహకరించాలని, తమ తమ ప్రాంతంలో ఎలాంటి ఘటనలు జరిగినా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు.
- గెలుపోటములు సహజమని వాటిని సీరియస్‌గా తీసుకొవద్దన్నారు. గ్రామాలు, బస్తీలు, కాలనీల్లో పోలీసు బందోబస్తును మరింత ముమ్మరం చేస్తున్నామన్నారు.
- బ్లూ కోట్స్ సిబ్బందితో రక్షక్ వాహనాలు నిరంతరం బందోబస్తును పర్యవేక్షిస్తామన్నారు. ఎలాంటి సమాచారం ఉన్నా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

భారీ బందోబస్తు..

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ లార్డ్స్ ఇంజినీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రం దగ్గర ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇద్దరు డీఎస్పీలు, 10 మంది ఏసీపీలు, 30 మంది ఇన్‌స్పెక్టర్లు, 70 మంది ఎస్సైలు, 250 మంది కానిస్టేబుళ్లతో పాటు రెండు ఏఆర్ పెటల్స్, ఐదు స్పెషల్ ఫోర్సెస్ టీమ్‌లతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ భద్రతను ఏర్పాటు చేశామని ఓ పోలీస్ అధికారి తెలిపారు.

ఏజెంట్లకు పాస్‌లు తప్పనిసరి..

రాజేంద్రనగర్: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో హిమాయత్‌సాగర్ లార్డ్స్ కళాశాల సమీపంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఓట్ల లెక్కింపు సందర్భంగా లెక్కింపు కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. మూడంచెల భద్రత మధ్య ఓట్ల లెక్కింపు కొనసాగనుందన్నారు. లెక్కింపు కేంద్రానికి అనుమతి ఉన్న అధికారులు, సిబ్బంది మాత్రమే రావాలన్నారు. తమకు అందించిన పాస్‌లు తప్పనిసరిగా మెడలో ధరించాలన్నారు. పోలీసు సిబ్బంది తనిఖీల సందర్భంగా తప్పనిసరిగా పాస్‌లను ప్రదర్శించాలన్నారు. కౌంటింగ్ హాళ్లకు కేవలం అభ్యర్థులు సూచించిన ఏజెంట్లకు మాత్రమే అనుమతిస్తామన్నారు.



మాట్లాడుతున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి ..

రాజేంద్రనగర్: ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ మల్లయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. లార్డ్స్ కళాశాల ప్రాంగణం భవనంలోని నాల్గో అంతస్తులో లెక్కింపునకు 28 టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో 542 పోలింగ్ బూత్‌లు ఉండటంతో 28 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. 28 కౌంటింగ్ టేబుళ్ల ద్వారా 20 రౌండ్‌లలో కౌంటింగ్‌ను పూర్తి చేసి ఫలితాన్ని ప్రకటిస్తామన్నారు. ఉదయం పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కింపుతో కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్లు అధికంగా ఉండటంతో ప్రత్యేకంగా ఐదు టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి టేబుల్‌పై 500 పోస్టల్ బ్యాలెట్లను లెక్కించనున్నట్లు వివరించారు. లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే శిక్షణను ఇచ్చామని, వారితో మాక్ కౌంటింగ్‌ను సైతం నిర్వహించామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కౌంటింగ్ సందర్భంగా విధులను అప్పగించామన్నారు. స్ట్రాంగ్‌రూమ్ నుంచి ఈవీఎంలను తీసుకొచ్చేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించినట్లు వివరించారు. సిబ్బంది అధికారులు తెలిపిన ఈవీఎంలను టేబుళ్ల నంబర్ ఆధారంగా అందిస్తారన్నారు. లెక్కించిన అనంతరం వాటిని తిరిగి స్ట్రాంగ్‌రూమ్‌కు తరలిస్తారన్నారు. ప్రతిరౌండ్‌లో 28 బూత్‌లకు సంబంధించిన ఓట్లలెక్కింపు జరుగుతుందని ఈ లెక్కింపు ప్రక్రియ 30-40 నిమిషాల పాటు జరుగుతుందన్నారు. ప్రక్రియ ముగిసిన వెంటనే ఆ రౌండ్‌కు సంబంధించిన ఫలితాలను ప్రకటిస్తామన్నారు. కౌంటింగ్‌హాల్ బయట మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. తమ సిబ్బంది మీడియా సెంటర్ వద్దకు వెళ్లి రౌండ్‌ల వారీగా అభ్యర్థులకు పోలైన ఓట్లను వివరిస్తారన్నారు.

మొదటి రౌండ్ ఫలితం 9 గంటలకు..

- నియోజకవర్గంలోని పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రక్రియ గంట నుంచి గంటన్నర పట్టనుంది. ఈ లెక్కన పోస్టల్ బ్యాలెట్‌లపై మొదటి ఫలితం 9 గంటలకు వెలువడనుంది. పోస్టల్ బ్యాలెట్ ఫలితమే నియోజకవర్గం ఓట్ల లెక్కింపు మొదటి ఫలితం కానుంది. అనంతరం ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభం కానుంది.

సాయంత్రానికి తుది ఫలితం..

- నియోజకవర్గంలోని 20 రౌండ్‌ల ఓట్ల లెక్కింపు అనంతరం తుది ఫలితం ప్రకటించనున్నారు. ప్రతి రౌండ్ అరగంట నుంచి 45 నిమిషాలు కానుంది. ఈ లెక్కన సాయంత్రం 5 గంటల అనంతరమే తుది ఫలితం రానుంది.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబు అవుతున్న ఆలయం

శంషాబాద్ రూరల్: మండలంలోని జూకల్‌లో పునర్నిర్మాణం చేపట్టిన శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 4 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరపనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. మూడ్రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, సామూహిక కుంకుమార్చన, కార్తీకదీపోత్సవం, అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. ఉత్సవాల కోసం ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. రంగులు వేసి విద్యుదీపాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంలో ఆంజనేయస్వామి, వినాయకుడు, నవగ్రహ దేవతలు, రేణుక ఎల్లమ్మదేవి, పోతలింగన్న, మైసమ్మతల్లి, చౌడమ్మతల్లి, సోమన్న స్వామి దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. దీంతో పాటు ధ్వజస్తంభం, శిఖర కలశ ప్రతిష్ఠాపన ఉంటుందని, ఉత్సవాలను విజయవంతం చేయడానికి గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్ నర్సమ్మ, ఉపసర్పంచ్ మల్లారెడ్డి, గ్రామపెద్దలు కోరారు.

నేడు మద్యం దుకాణాలు బంద్

రాజేంద్రనగర్: ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆదివారం మద్యం దుకాణాలను మూసివేస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. మద్యం దుకాణాలతో పాటు బార్లు, కల్లు దుకాణాలు పబ్‌లను మూసేస్తున్నట్లు ప్రకటించారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎన్నికల కమిషన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బంద్ చేపడుతున్నట్లు వివరించారు.

వీధికుక్కలను పట్టుకున్న బ్లూక్రాస్



ఎస్‌వీ పార్కులో కుక్కలను పట్టుకున్న బ్లూక్రాస్ సిబ్బంది

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో వీధికుక్కలను బ్లూక్రాస్ సొసైటీ సిబ్బంది పట్టుకున్నారు. వాటిల్లో రేబిస్ లక్షణాలు కనిపించడం, పలువురిని కరవడం చేస్తుండటంతో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంశీ వారికి ఫిర్యాదు చేశారు. దీంతో వారు స్పందించి శనివారం ఎస్‌వీ పార్కు చుట్టు పక్కల ఉన్న వాటిని పట్టుకున్నారు. వాటికి రెబిస్ లక్షణాలు పోయేలా ఇంజక్షన్‌లు ఇవ్వటం, పిల్లలు పుట్టకుండా నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తామని బ్లూక్రాస్ సొసైటీ సభ్యులు వివరించారు. టౌన్‌షిప్‌లో వారంరోజుల పాటు డ్రైవ్ నిర్వహించి కుక్కల బెడదను నివారిస్తామని స్పష్టం చేశారు.

చెరువులను శుభ్రంగా ఉంచుకోవాలి



ముష్కిచెరువు పరిసరాలను శుభ్రం చేసిన విద్యార్థినులు

మణికొండ: చెరువుల పరివాహక ప్రాంతాన్ని కొందరు వ్యర్థాలకు కేంద్రాలుగా మారుస్తున్నారని, వాటి వద్ద ఎలాంటి చెత్త, చెదారాలను వేయొద్దని ధృవాన్ష్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మధు శికచౌదరి అన్నారు. శనివారం మణికొండ, నార్సింగి సరిహద్దులో ఉన్న ముష్కిచెరువు పరివాహకంలో సెయింటాన్స్ కళాశాల విద్యార్థినులు క్లీనింగ్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెరువులను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వాటిల్లో మురికినీరు చేరకుండా వ్యర్థాలను వేయకుండా ఉంటే అవి ఆహ్లాదంగా ఉంటాయని, వాటిని శుభ్రంగా ఉంచేందుకు తమ సంస్థ వాలంటీర్ల సహకారంతో ఎంతో కృషి చేస్తుందన్నారు.

ఫలితాలపై ఉత్కంఠ..

మణికొండ: రాష్ట్ర అసెంబ్లీకి నవంబర్ 30న ఎన్నికలు జరగడం, వాటి ఫలితాలు నేడు ప్రకటిస్తుండటంతో ఎటు చూసినా వాటిపైనే చర్చ కొనసాగుతోంది. ఎవరిద్దరూ.. కలిసినా రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఎవరికి గెలిచే అవకాశం ఉందని చర్చించుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సైతం ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి, ఎవరు ప్రభుత్వం ఏర్పాటు చేస్తారు, లేక హంగ్ వస్తుందా.. ? అనే చర్చలు జోరుగా సాగుతున్నాయి. ఇక ఆయా పార్టీలకు పనిచేసిన కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు తమ పార్టీ అభ్యర్థికే గెలిచే అవకాశం ఉందంటూ సోషల్ మీడియాలలో ప్రచారం హోరెత్తిస్తున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 2018లో జరిగిన ఎన్నికల్లో 4,41,074 మంది ఓటర్లు ఉండగా అందులో 56.89 శాతం పోలింగ్ జరిగింది. ఈసారి 5,81,937 ఓట్లు ఉండగా 3,24,917 మంది ఓట్లు వేయగా ఓటింగ్ శాతం మాత్రం 55.83గా నమోదైంది. మండలాల వారీగా చూస్తే రాజేంద్రనగర్ మండలంలో 3,15,054 ఓట్లు ఉండగా.. అందులో 1,60,636 ఓట్లు పోల్‌తో 50.98 శాతం, శంషాబాద్ మండలంలో 87,256 ఓట్లు ఉండగా.. 63,658 ఓట్లు 72.90శాతంగా ఉంది. గండిపేట మండల పరిధిలో 1,79,627ఓట్లు ఉండగా 1,00,623ఓట్లు పోలై 56.01 శాతంగా నమోదయ్యాయి. రాజకీయ నాయకులతో పాటు ఓటింగ్‌లో పాల్గొన్న వారంతా ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం వరకు ఈ ఉత్కంఠకు తెరపడి ప్రజల ఆకాంక్షల మేరకు ఎమ్మెల్యేగా ఎన్నికై.. ప్రభుత్వం ఏర్పడుతుందని వారంతా భావిస్తున్నారు.

ట్రాఫిక్‌సమస్యపై చర్యలు తీసుకోండి



ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడుతున్న వైనం

రాజేంద్రనగర్: సబ్‌రోడ్డుతో పాటు ప్రధాన రహదారిపై ఇష్టానుసారంగా పార్కింగ్‌తో పాటు వీధి వ్యాపారం చేసే వారు తోపుడు బండ్లను ఏర్పాటు చేయడంతో తరుచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడినా.. వాహనాలు పార్కింగ్ చేసిన వారితో పాటు చిల్లర వ్యాపారం చేస్తున్న వారు పట్టించుకోవడం లేదు. ఇదేమని ప్రశ్నిస్తే వాహనదారులపైనే బహిరంగంగా దాడులకు దిగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్నపాటి అంతరాయం కాస్తా భారీ ట్రాఫిక్ జామ్‌కు దారి తీస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఉప్పర్‌పల్లి పిల్లర్ నంబర్ 181 వద్ద సబ్ రోడ్డుతో పాటు రోడ్డుకు ఇరువైపుల ద్విచక్ర వాహనాలతో పాటు కార్లను పార్కు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న వ్యాపార దుకాణాలకు వచ్చే వారు వారి వద్ద పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్లపై పార్క్ చేస్తున్నారు. ఈ రోడ్లపైనే చిల్లర వ్యాపారులు తోపుడు బండ్లను ఏర్పాటు చేస్తున్నారు.



రోడ్డుపై భారీగా నిలిచిపోయిన వాహనాలు

వీటి కారణంగా ప్రధాన రహదారి కుంచించుకుపోయి ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుంది. ఈ రహదారి ప్రధాన రహదారి కావడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో విపరీతంగా ట్రాఫిక్ ఉంటోంది. చిల్లర వ్యాపారుల వద్దకు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారు రోడ్లపైనే వాహనాలు నిలిపి కొనుగోలు చేస్తుండటంతో వెనుక వచ్చే వాహనాలు నిలిచిపోతున్నాయి. నిమిషాల వ్యవధిలో చిన్నపాటి జామ్ కాస్తా భారీ ట్రాఫిక్ అంతరాయానికి కారణమవుతోంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు రెండు గంటల సమయం పడుతోంది. ఈ సమస్యపై పోలీసులు దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.

కార్తీక వనభోజనాలు



మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మణికొండ: కార్తీకమాసంలో సామూహికంగా వనభోజనాలు చేయటం ఆనవాయితీగా వస్తుంది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం శంషాబాద్ మండలంలోని అమ్మపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం వద్ద వనభోజనాలను నిర్వహించగా.. సభ్యులంతా తరలివెళ్లారు. ఈనెల 10న అలకాపూర్ టౌన్‌షిప్ ఎంజీపార్కులో నిర్వహించే కార్తీక దీపోత్సవం ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అసోసియేషన్ నాయకులు కోరారు.

ఉత్తమ సాహితీవేత్త ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

యోగి వేమన విశ్వవిద్యాలయంలో అవార్డు అందజేత



ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుకు పురస్కారం అందిస్తున్న అతిథులు

రాయదుర్గం: సాహిత్యంలో విశేష సేవలు అందిస్తున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావును తమిళ సాంస్కృతిక పరిశోధనా కేంద్రం పాలక్కడ్ ఆధ్వర్యంలో శనివారం కడప యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఉత్తమ సాహితీవేత్త పురస్కారం అందజేశారు. కడపలోని యోగివేమన విశ్వవిద్యాలయం, తమిళ కల్చరల్ రీసెర్చ్ సెంటర్ పాలక్కాడ్, డీఏవీ కళాశాల అజ్మీర్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన వనవిల్‌కె రవి రచనల్లో భిన్న దృక్పథాలు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య వైపి వెంకట సుబ్బయ్య, ప్రసిద్ధ తమిళకవి, న్యాయవాది వనవిల్‌కె రవి, రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీ హిందీశాఖ అధ్యక్షురాలు ప్రొఫెసర్ ఎస్ లక్ష్మీఅయ్యర్, ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు డైరెక్టర్ ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ చేతుల మీదుగా పురస్కారం అందించారు. ఈ సందర్భంగా పలువురు ప్రొఫెసర్లు, అధికారులు, పరిశోధక విద్యార్థులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ఆచార్య చింతా సుధాకర్, ఆచార్య ఎస్ ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఉప్పలధడియం వెంకటేశ్వర, డాక్టర్ జిల్లెల బాలాజీ, వైవియు తెలుగుశాఖ అధ్యక్షురాలు ఆచార్య జి పార్వతి, ఆచార్యులు ఏజి దాము, పి రమాదేవి, వినోదిని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య

అత్తాపూర్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ బాలిక ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై నిమ్మల వెంకన్న కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శివరాంపల్లి వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన వెంకటేశ్ కుమార్తె కావేరి (13) శివరాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. కాగా ఆమె గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ స్కూల్‌కు సరిగ్గా హాజరు కావడం లేదు. శనివారం ఇంట్లో ఒంటరిగా ఉన్న కావేరి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

4న రుద్రహోమం

రాయదుర్గం: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో సోమవారం రుద్రహోమం ప్రత్యేకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి శనివారం తెలిపారు. ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. ఉదయం10 గంటల నుంచి సాయంత్రం వరకు 108 సార్లు రుద్ర హోమం నిర్వహించనున్నట్లు వివరించారు. గణపతి హోమం, బగలాముఖి హోమాలు జరుగుతాయని ,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

38/ఎలో 74.5 శాతం పోలింగ్

● పోలింగ్ స్టేషన్ 432లో అత్యల్పంగా 28.1 శాతం
● 268 పోలింగ్ స్టేషన్లలో 48.75 శాతం కంటే తక్కువ

గచ్చిబౌలి: ఈసారి పోలింగ్ 48.75 శాతం ఓట్లు నమోదయ్యాయి. 638 పోలింగ్ స్టేషన్లు ఉండగా కొన్ని చోట్ల ఎక్కువగా మరికొన్ని చోట్ల తక్కువగా జరిగింది. చందానగర్‌లోని హుడా కాలనీలో గల ఇగ్నీయమ్ వరల్డ్ స్కూల్‌లోని పోలింగ్ స్టేషన్- 38/ఎలో అత్యధికంగా 74.57 శాతం ఓట్లు పోలయ్యాయి. శేరిలింగంపల్లిలోని పవిత్ర ఇంటర్నేషనల్ స్కూల్‌లోని పోలింగ్ స్టేషన్- 90లో 74.23, జగద్గిరిగుట్టలోని వెంకటేశ్వర్ కాలనీ పోలింగ్ స్టేషన్- 565లో 68.76 శాతం ఓట్లు పోలయ్యాయి. 218 పోలింగ్ స్టేషన్లలో 50 నుంచి 59 శాతం ఓట్లు పోలయ్యాయి. మాదాపూర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఫైన్ ఆర్ట్స్ కాలేజీలోని పోలింగ్ స్టేషన్- 432లో అత్యల్పంగా 28.1 శాతం, ఓల్డ్ ఎంఐజీలోని పోలింగ్ స్టేషన్- 57లో 29.6, అయ్యప్పసొసైటీలోని మెరీడియన్ స్కూల్‌లోని పోలింగ్ స్టేషన్- 394లో 30.7 శాతం ఓట్లు పోలయ్యాయి. 268 పోలింగ్ స్టేషన్లలో 30 శాతం నుంచి 48.75 శాతం కంటె తక్కువగా ఓట్లు పోలయ్యాయి. దీంతో పోలింగ్ సగటున 48.75 శాతానికి మాత్రమే పరిమితమయ్యింది.

తారానగర్-లింగంపల్లి రాకపోకలకు బ్రేక్

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద సమస్య పరిష్కారానికి చేపట్టిన బాక్స్‌టైప్ కల్వర్ట్ నాలా పనులు కొనసాగుతున్నాయి. లింగంపల్లి విలేజ్ కమాన్ వద్ద కల్వర్టు పనులు చేపట్టడంతో తారానగర్ నుంచి లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి, రైల్వే స్టేషన్‌లకు రాకపోకలను మళ్లించారు. లింగంపల్లి నుంచి తారానగర్‌కు వెళ్లే వారు లింగంపల్లి విలేజ్ మీదుగా వెళ్లాల్సి ఉంది. అదే విధంగా తారానగర్ నుంచి వచ్చే వారు లింగంపల్లి విలేజ్ లోపలి నుంచి అండర్ బ్రిడ్జి వరకు రావాల్సి ఉంది.

రాయితీతో వైద్యసేవలందించాలని వినతి



కాంటినెంటల్ ఆసుపత్రి చైర్మన్‌తో మణికొండ రెడ్డి సంఘం నాయకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో 20 వేల వరకు ఉన్న రెడ్డీలకు రాయితీతో కూడిన నాణ్యమైన వైద్యసేవలను అందించాలని మణికొండ రెడ్డి సంఘం నాయకులు కాంటినెంటల్ ఆసుపత్రి చైర్మన్ గురువారెడ్డిని కోరారు. శనివారం సంఘం నాయకులు ఆయనను ఆసుపత్రిలో కలిశారు. ఈ సందర్భంగా తమ మున్సిపాలిటీకి సమీపంలోనే మీ ఆసుపత్రి ఉందని, రాయితీతో కూడిన వైద్యం అందిస్తే తమ సంఘం సభ్యులంతా మీ ఆసుపత్రి సేవలను అందుకుంటారని కోరారు. రెడ్డీల సంక్షేమానికి తమ సంఘం కృషి చేస్తుందని, మీరు అండగా నిలవాలని కోరారు. ప్రతి విభాగానికి కమిటీలు వేసి వారి ద్వారా అన్ని రకాల సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారని సభ్యులు తెలిపారు. రెడ్డి సంఘం నాయకులు నరేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, శ్రీపతిరెడ్డి తదితరులున్నారు.

పార్కును పట్టించుకోండి..

శేరిలింగంపల్లి: లక్షలాది రూపాయల వ్యయంతో అభివృద్ధి చేసిన పార్కులను పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా తయారవుతున్నాయి. నగర వ్యాప్తంగా థీమ్ పార్కులను అభివృద్ధి చేస్తున్న అధికారులు ఉన్న పార్కులపై నిర్లక్ష్యం చూపుతున్నారనడానికి శేరిలింగంపల్లిలోని హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలోని జీహెచ్ఎంసీ పార్కు ఉదాహరణగా నిలుస్తోంది. హుడాట్రేడ్ సెంటర్ కాలనీ నల్లగండ్ల కూరగాయల మార్కెట్ సమీపంలోని పార్కును జీహెచ్ఎంసీ లక్షలాది రూపాయలతో అభివృద్ధి చేసింది.


కరువైన ఆహ్లాదం.. ఇదీ హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ పార్కు

- పార్కుపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారిందని స్థానికులు అంటున్నారు. కాలనీలో మొత్తం అపార్టుమెంటులే ఉండటంతో సాయంత్రం వేళ కాసేపు సేద తీరుదామనుకుంటే ఆ అవకాశం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- పార్కులో ఎటు చూసినా చెత్త, వ్యర్థాలు కనిపిస్తున్నాయి. పార్కులో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడంతో కాలనీవాసులు అసౌకర్యానికి గురవుతున్నారు.
- పగలు, రాత్రి తేడా లేకుండా మందుబాబులు ఇక్కడ కూర్చొని తాగుతున్నారని స్థానికులు తెలిపారు.
- పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ పార్కు దుస్థితి

25 కిలోమీటర్లు సైకిల్ రైడ్



రాయదుర్గం: వీకెండ్ సైకిల్ రైడ్ ఉత్సాహంగా సాగింది. గచ్చిబౌలిలోని హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్కేప్ అండ్ ఎక్స్‌ప్లోర్ టీమ్ పర్యవేక్షణలో వ్యవస్థాపకుడు అశోక్ నాయకత్వంలో 25 కిలోమీటర్ల సైకిల్ రైడ్‌లో పాల్గొన్నారు. గచ్చిబౌలి హెచ్‌బీసీ వద్ద ప్రారంభమైన ఈ రైడ్ బయోడైవర్సిటీ పార్కు కూడలి, రాయదుర్గం, టోలిచౌకి, నానల్‌నగర్ కూడలి, లంగర్‌హౌజ్ మీదుగా గోల్కొండ వరకు సాగింది. అనంతరం తిరిగి అదేమార్గంలో హెచ్‌బీసీ బైక్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. ఔత్సాహికులు వీకెండ్‌లో ఉదయం 5.30 గంటలకు హెచ్‌బీసీ బైక్ స్టేషన్‌కు చేరుకుంటే పాల్గొనవచ్చని, సైకిళ్లు అందుబాటులో ఉంటాయని హెచ్‌బీసీ మేనేజర్ శ్రావణ్ తెలిపారు.